క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సింహాద్రిపురం : ఈనెల 18వ తేదీన పదవ తరగతి పరీక్షలు ప్రారంభమై బుధవారంతో ప్రశాంతగా ముగిశాయని ఎంఈఓలు శ్రీనివాసులురెడ్డి, శారదలు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రెండు సెంటర్లను ఏర్పాటు చేశామని, జడ్పీహెచ్ స్కూల్‌లో 100 మంది, కెజీబీవీ సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాశారన్నారు. పరీక్షల్లో ఎటువంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఈనెల 28 నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ఈ ఉచిత కోచింగ్ పాలిసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించేందుకు ఉచితంగా మెటీరియల్స్‌ను కూడా అందజేయనున్నారని ఈ అవకాశాన్ని 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులచే ముద్దనూర్ రహదారిలో ఉన్న పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9491407363, 9490584458 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవం.. మాధవస్వామి రథోత్సవం



రథోత్సవంలో మాధవస్వామి

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో బుధవారం సాయంత్రం శ్రీ మాధవస్వామి రథోత్సవం డప్పులు, వాయిద్యాల మధ్య గ్రామంలోని వీధుల్లో నేత్ర పర్వంగా సాగింది. భక్తులు భక్తి పారవశ్యంతో గోవిందా గోవిందా నామస్మరణతో స్వామి వారి రథం లాగారు. రథోత్సవం వెంబడి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఆలయ చైర్మన్ ఎల్.శ్రీనువాసులరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కమలాపురం : పట్టణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్ ఆవరణలో బీసీడీఎస్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అభిలాష్ నేత్ర వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యులు గురు అభిలాష్ రోగులకు పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి కడపకు రెఫర్ చేశారు. వారికి ఆపరేషన్ చేసిన తర్వాత కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీడీఎస్, మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షుడు యాగప్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ స్నాతకోత్సవానికి దరఖాస్తుల వెల్లువ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.ఆర్. రావు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో డిగ్రీ పీజీ, పీహెచ్.డి. పట్టాలు పొందడానికి దరఖాస్తు దారులు వెల్లువెత్తుతున్నారు. విద్యార్థులతో బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణం కళకళలాడింది. వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 10,682 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. రాబోయే మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

అడుగడుగునా జననీరాజనం

మేమంతా సిద్ధం బస్సుయాత్ర ఇడుపులపాయ నుంచి బయలుదేరింది. అడుగడుగునా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనం నీరాజనం పట్టారు. వేంపల్లె, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరులో జరిగిన సిద్ధం సభ వరకు ఈ యాత్ర సాగింది.



ఎర్రగుంట్ల పట్టణంలో జనసందోహం



ఎర్రగుంట్లలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల : ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచి బుధవారం మధ్యాహ్నం 1.35 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర ప్రారంభమైంది. ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన బస్సుయాత్రకు దారిపొడవునా జననీరాజనం పట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ‘మేమంతా సిద్ధం’ అంటూ ప్లకార్డులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలు చేతపట్టుకుని వైఎస్ జగన్ రాకకోసం నిరీక్షిస్తూ ఆయన వచ్చిన వెంటనే బస్సుపై పూలవర్షం కురిపిస్తూ ‘జై జగన్’ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దారిపొడవునా తన కోసం వేచిచూస్తున్న జనాలకు ఆత్మీయంగా చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడక్కడ బస్సు ఆపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సు దిగివచ్చి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, వారి సమస్యలను సావధానంగా వింటూ ఆత్మీయంగా పలకరించారు. యువకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సెల్ఫీ దిగడానికి ఉత్సాహం చూపగా సీఎం స్వయంగా తానే వారి మొబైల్ తీసుకుని సెల్ఫీలు దిగుతూ వారిని ఉత్సాహపరిచారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సుయాత్రకు దారిపొడవునా ప్రజలు నీరాజనాలు పలికారు. ముందుగా ఇడుపులపాయ వీరన్నగట్టుపల్లి ప్రజలు, మాజీ సర్పంచ్ చలపతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు. దారిపొడవునా పూలవర్షం కురిపించారు. వీరన్నగట్టుపల్లి సర్కిల్, కుమ్మరాంపల్లి, సాయిరజిత, పెట్రోల్ బంక్, నాలుగురోడ్ల కూడలి, బస్టాండ్, క్రిస్టియన్‌కాలనీ, హనుమాన్ జంక్షన్‌ల వద్ద భారీ జనాలు గుమికూడి ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు. వీరన్నగట్టుపల్లె సర్కిల్ వద్ద నుంచి వేంపల్లె హనుమాన్ జంక్షన్ వరకు దారిపొడవునా జనాలు కిక్కిరిసిపోయారు. మళ్లీ సీఎం నువ్వే జగన్ అంటూ నినాదాలు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వల్లూరు, వీరపునాయునిపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర మొదటి రోజైన బుధవారం వీరపునాయునిపల్లె మండలంలో సాగింది. కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని తంగెడుపల్లె క్రాస్ రోడ్డు వద్ద ప్రజలు ఆయనకు గజ మాలతో ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఉరుటూరు వరకు మండల పరిధిలో బస్సు యాత్ర సాగింది. ప్రతి చోట ప్రజలు బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. మారు మూల పల్లెల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు పెద్ద ఎత్తున ప్రధాన రహదారిలోని మర్రిపల్లె, నేలతిమ్మాయపల్లె, పాలగిరి క్రాస్, వీరపునాయునిపల్లె, సంగాలపల్లె, గంగిరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె, పాయసంపల్లె క్రాస్, ఉరుటూరు గ్రామాల వద్దకు చేరుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయక తమ అభిమాన నేతను చూడాలన్న ఆశతో ఆయన రాక కోసం వృద్ధులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి నిరీక్షించారు. నిర్ణీత సమయానికి సుమారు రెండు గంటలు ఆలస్యంగా బస్సు యాత్ర సాగినప్పటికీ ఆయన కోసం వేచి వుండి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. బస్సు తమ ప్రాంతానికి చేరుకోగానే కేకలు, కేరింతలు వేస్తూ ఉత్సాహంగా వైఎస్ఆర్‌సీపీ జండాలు ఊపుతూ పూలు జల్లుతూ ఘనంగా ఆహ్వానం పలికారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి మేము సిద్ధం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజల ఉత్సాహాన్ని చూసిన జగన్ బస్సుపైకి ఎక్కి చిరునవ్వుతో ప్రజలకు అభివాదం చేయడంతో పాటు పలువురు నాయకులను పేరు పేరునా పలకరించారు. బస్సులో కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వున్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై.కోడూరు, పెద్దనపాడు, ఎర్రగుంట్ల, పోట్లదుర్తి గ్రామాల రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర పెద్దనపాడు గ్రామంలో ప్రవేశించగానే ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. పెద్దనపాడు, వై.కోడూరు, ఎర్రగుంట్ల, పోట్లదుర్తి గ్రామాలలో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాలతో మహిళలు మానవహారం ఏర్పాడి స్వాగతం పలికారు. యువత బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. పోట్లదుర్తి గ్రామంలోని పెన్నానది బ్రిడ్జిపైన, ఎర్రగుంట్ల కూడలిలో గంగబ్రదర్స్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలు బ్యానర్లతో నిండిపోయింది. మజ్జిక వాటర్ ప్యాకట్లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిటీసీలు, ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వీరపునాయునిపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి



తంగెడుపల్లె వద్ద స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్న మహిళలు



ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో జై జగన్ అంటున్న మహిళలు



వేంపల్లెలో మేమంతా సిద్ధం బస్సుయాత్రలో పాల్గొన్న జనం

నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. పట్టణంలోని రోటరీపురం, సీయోనుపురం, చెన్నారెడ్డి కాలనీ, తదితర ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించి అక్కడ ఉన్న నీటి పంపింగ్ మోటార్, పైప్‌లైన్ లీకేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం సచివాలయ తనిఖీల్లో భాగంగా వెలమవారిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే భాకరాపురం, యూపీహెచ్‌సీలోని ఎస్‌బీఐ కాలనీ సచివాలయ పరిధిలోని ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీపీఓ అజయ్, ఎంఈఈ చిదానంద్, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

డెంగీ, మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు : గ్రామాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాప్తి చెందాయని ప్రజలు అప్రమత్తంగా ఉండటమే కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. బుధవారం చెన్నూరు కొత్త గాంధీనగర్‌లో ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి వాటిని ల్యాబ్‌కు పంపించి అలాగే ప్రతి ఇంటికి వద్ద లార్వా సర్వే నిర్వహించామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు విష జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలని అదేవిధంగా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అలాగే తమ పరిసరాల్లో గుంతలలో, పాతబడ్డ కూలర్లు, వాహనాల టైర్లలో నీటి నిల్వలు ఉండకూడదన్నారు. జ్వరం వచ్చినట్లు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉండేందుకు వైద్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని ఉప మలేరియా అధికారి వెంకటరెడ్డి తెలిపారు. అలాగే గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆమె డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో దోమలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు దోమల మందు ఇంటింటికి వెళ్లి స్ప్రే చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అన్నదానం

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు బుధవారం కొడిదల హుస్సేనమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె కొడుకు రిటైర్డ్ తహసీల్దార్ కుళ్లాయప్ప, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. 26వ తేదీ కడప స్పోర్ట్స్ కళాశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ ట్రైల్స్‌లో పీయూసీ-1, పీయూసీ-2 నుంచి 7 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపారు.

వీరు ఈ నెల 30, 31 తేదీలలో విజయవాడలోని కృష్ణలంక లో జరుగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పవర్ లి ఫ్టింగ్ పోటీలలో పాల్గొననున్నారన్నారు. తమ వి ద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల డైరెక్టర్‌తో పా టు అకాడమిక్ డీన్ రత్నకుమారి, ఫైనాన్స్ ఆఫీసర్ రమేష్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

జమ్మలమడుగు : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయం వద్ద ఓటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులందరూ కచ్చితంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన నాయకుడిని పార్టీలను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి గంగులయ్య, రసూలమ్మ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఎస్. ప్రమోద్‌కుమార్

మేమంతా సిద్ధం సభకు తరలి వెళ్లిన అభిమానులు



పులివెందులలో బస్సుయాత్ర సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు



వేముల : సభకు వెళ్తున్న మహిళలతో మండల పరిశీలకులు, గ్రంథాలయ చైర్‌పర్సన్

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ప్రొద్దుటూరులో జరిగే ఈ సభకు వెళ్లే నాయకులు, పార్టీ శ్రేణులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిల ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అలాగే నూరుబాషా సంఘం కార్పొరేషన్ చైర్మన్ రసూల్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆధ్వర్యంలో కార్యకర్తలు, పార్టీశ్రేణులు భారీగా తరలివెళ్లారు.

కమలాపురంలో..

కమలాపురం : ప్రొద్దుటూరులో జరిగే మేమంతా సిద్ధం బహిరంగ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి మారు మూల పల్లెల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక బస్సుల్లో భారీ ఎత్తున తరలివెళ్లారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లెలోని పులివెందుల రోడ్డు, కడప రోడ్డు, బైపాస్ రోడ్లలో వేల్పుల గ్రామం లింగాల రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 500 బైకులు, 500 వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరన్నగట్టుపల్లి, వేంపల్లె నాలుగురోడ్ల కూడలి, బస్టాండు, హనుమాన్‌జంక్షన్‌ల వద్ద పోలీసులు జనాలు రోడ్లపైకి రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

వేములలో..

వేముల : మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లాగంగాదేవిల ఆధ్వర్యంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 150 వాహనాల్లో సుమారు 6 వేల మంది తరలివెళ్లారు. అలాగే మండలంలోని వేల్పుల గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉషారాణిల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో మండల నలుమూలల నుంచి అభిమానులు తరలివచ్చారు.

లింగాలలో..

లింగాల : మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అన్ని గ్రామాల నుంచి బస్సులు, వివిధ వాహనాల్లో వెళ్లారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులు, వివిధ వాహనాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు, అభిమానులు ప్రొద్దుటూరుకు బయలుదేరి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పిలుపుమేరకు మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు, కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల మండలాలనుంచి భారీగా జనాలు ప్రొద్దుటూరు ప్రత్యేక వాహనాలలు తరలివెళ్లారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్యల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



జమ్మలమడుగు : బస్సుయాత్రకు తరలివెళ్లుతున్న ఉప్పలపాడు గ్రామస్థులు



పులివెందులలో బస్సుయాత్ర సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులతో వైఎస్ మనోహర్‌రెడ్డి



లింగాలలో బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



సింహాద్రిపురంలో బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు



కమలాపురం : పి.వెంకటాపురంలో బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

నూతన ఆవిష్కరణల దిశగా పరిశోధనలు

వైవీయూ : నూతన ఆవిష్కరణల దిశగా పరిశోధనలు కొనసాగాలని బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ గౌరవ శాస్త్రవేత్త డాక్టర్ సంజప్ప సూచించారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ‘జీవశాస్త్రంలో ఆధునిక పోకడలు’ అన్న అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సంజప్ప మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు రావాలని, దేశానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణల దిశగా అవి సాగాలన్నారు. మరొక శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.ఆర్. రావు మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌ల్లో పాల్గొనడం ద్వారా నూతన అంశాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులు, అధ్యాపకులకు లభిస్తుందన్నారు. వైవీయూ వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ ఎ. మధుసూధన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. సూర్యనారాయణరెడ్డి, ఎల్. అనంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య

ఎర్రగుంట్ల : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. మున్సిపల్ కార్యాలయంకు వచ్చే వారందరు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు